నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, ఆదివారం 22 డిసెంబర్ 2024 SIDDIPET

## ఝరాసంగం ప్రధాన రోడ్డును విస్తరించేలా చర్యలు తీసుకోవాలి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్/ఝరాసంగం, డిసెంబర్ 21: మండలకేంద్రమైన ఝరాసంగానికి వెళ్లే ప్రధాన రోడ్డును విస్తరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కోరారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తులకు ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే కేతకీ సంగమేశ్వర స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు వస్తుంటారన్నారు. నిమ్జ్ ప్రాజెక్టు కూడా మండలంలోనే ఉండడం, పలు ఐటీ పరిశ్రమలు ఏర్పాటు కానుండడంతో పారిశ్రామిక వేత్తలు, సంబంధిత అధికారులు వస్తుంటారని పేర్కొన్నారు. మండల కేంద్రానికి ప్రధాన రోడ్డు మార్గం గుండానే రాకపోకలు సాగించే అవకాశం ఉందని, ఉన్న రోడ్డుపై గుంతలు పడడం, రద్దీ కూడా ఎక్కువగా ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఇరుకుగా ఉన్న రోడ్డును విస్తరించి, బాగు చేసేందుకు రూ.5 కోట్ల నిధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు ఇరువైపుల ఉన్న విద్యుత్ స్తంభాలతో ఇబ్బందిగా ఉందన్నారు. రోడ్డు విస్తరణకు వెంటనే తగు చర్యలు తీసుకొని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, పారిశ్రామిక వేత్తలు, అధికారులకు ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.


## నేడు గవర్నర్ పర్యటన



ఏడుపాయల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

కొల్చారం, డిసెంబర్ 21: రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శనివారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. గవర్నర్ తునికిలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రాన్ని, మెదక్ చర్చిని సందర్శిస్తారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ముఖాముఖిలో పాల్గొంటారు. 25న సీఎం రేవంత్ రెడ్డి మెదక్ చర్చి, ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అధికారిక ఏర్పాట్లను పరిశీలించారు. శనివారం కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ నగేశ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మెదక్ చర్చి, ఏడుపాయల క్షేత్రాన్ని వేర్వేరుగా సందర్శించారు. కలెక్టర్ కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. కొల్చారం పాఠశాలలో బసకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నగేశ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గఫర్ మియా, ఎంపీడీవో కృష్ణవేణి, ఎస్‌ఐ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## 29న కొమురవెల్లి మల్లన్న కల్యాణం



చేర్యాల, డిసెంబర్ 21: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఈనెల 29న ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి తెలంగాణతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాల భక్తులు హాజరు కానున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, దాతలు, అధికారులకు, భక్తులకు ఆలయ వర్గాలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. 29న ఉదయం 10.45 గంటలకు కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోట బావివద్ద నిర్మించిన కల్యాణ వేదికలో కల్యాణం జరుగుతుంది. మహదేవుని వంశస్తులు, పడిగన్నగారి వంశస్తులు, 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య స్వామి పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరుగుతుంది. నడిపుడి మఠం భవానయ్య స్వామి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానశ్వర్ శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి పురోహితులుగా వ్యవహరిస్తారు. డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామీజీ వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తారు. ఆలయ ఈవో, వీరశైవ అర్చక, ఒగ్గు పూజారుల బృందం, ఆలయ సిబ్బంది పాల్గొంటారు. 29 కల్యాణం, 30న విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ వర్గాలు తెలిపాయి.

## చేపల వేటకెళ్లి మామ, అల్లుడు మృతి

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 21: చేపల వేటకెళ్లి మామ, అల్లుడు కాలువలో మునిగి మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్‌కు చెందిన గొడుగు శివకుమార్(30) కుకునూరుపల్లి మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాయపోల్ మండలం ఎల్కంటికి చెందిన కిష్టయ్య అల్లుడు శివకుమార్ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ శుక్రవారం సాయంత్రం కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం మల్లన్నసాగర్ కాలువలో చేపలు పట్టడానికి వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగి మామ, అల్లుడు మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి పోలీసులు శనివారం గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## ఈవీఎం గోదాం ఆకస్మిక తనిఖీ



సిద్దిపేటలో ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 21: సిద్దిపేట కలెక్టరేట్ పక్కనున్న ఈవీఎం గోదాంను శనివారం కలెక్టర్ మనుచౌదరి అదనపు కలెక్టర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాం చుట్టూ తిరిగి పరిశీలించి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సీసీ కెమెరాల పనితీరు, పోలీస్‌ల బందోబస్తు, రెవెన్యూ అధికారులు తరుచూ గోదాం ప్రాంతాన్ని పరిశీలించాలని సూచించారు. మూడు నెలలకోసారి రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి స్ట్రాంగ్ రూం తలుపులు తెరిచి, లోపల అన్నింటినీ పరిశీలించి, మళ్లీ సీల్ వేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఏవో అబ్దుల్ రహమాన్, అధికారులు ఉన్నారు.

## ఒక్కటైన తెలంగాణ అబ్బాయి, అమెరికా అమ్మాయి



కుటుంబ సభ్యుల మధ్య మూడుముళ్ల బంధంతో ఏకమైన జంట

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 21: తెలంగాణ అబ్బాయి, అమెరికా అమ్మాయి మూడు ముళ్ల బంధంతో ఏకమై ప్రేమకు వర్ణాలు, ఎల్లలు లేవని చాటారు. సిద్దిపేటకు చెందిన వడ్డెపల్లి శ్రీనాథ్ 15 ఏండ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. టెన్నిసి రాష్ట్రం నాస్విల్లి పట్టణానికి చెందిన క్రిస్టల్, శ్రీనాథ్ ఐదేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురు తమ కుటుంబాలకు ప్రేమ విషయం చెప్పి ఒప్పించారు. రెండు కుటుంబాల సమక్షంలో శనివారం సిద్దిపేటలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. హిందూ సంప్రదాయంలో జరిగిన వివాహ వేడుకను చూసి అమెరికన్లు ముగ్ధులయ్యారు.

# కాలువలు ఇలా.. నీరు వెళ్లేదెలా?

### ఉమ్మడి జిల్లాలోని కాలువల్లో నిండిపోయిన సిల్టు, పిచ్చిమొక్కలు



తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి కాలువలో చెత్తాచెదారం, రాళ్లురప్పలు



చిన్నకోడూరు, పెద్దకోడూరు పొలాలకు వెళ్లే కాలువల్లో పెరిగిన పిచ్చిమొక్కలు



దౌల్తాబాద్ మండలం కోనాపూర్, శౌరిపూర్ గ్రామాల మధ్య కాలువలో పేరుకుపోయిన గడ్డి

- నిర్వహణ మరిచిన నీటిపారుదల శాఖ అధికారులు
- యాసంగి సాగుకు యాక్షన్ ప్లాన్ కరువు..?
- నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలంటున్న రైతులు
- యాసంగి సాగుపై రైతుల అయోమయం
- పట్టించుకోని కాంగ్రెస్ పాలకులు

### నీళ్లిచ్చి ఆదుకోవాలి..



యాసంగి వరి పంట వేసుకోవడానికి నీళ్లు లేక దుక్కి దున్నుతలేం. కాలువలో పిచ్చి మొక్కలు పెరిగాయి. కాలువలో సిల్టుతో నిండిపోయి నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. బీఆర్‌ఎస్ సర్కారు ఉన్నప్పుడు యాసంగి, వానకాలం పంటలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందే నీళ్లు ఇడిచారు. సీఎం రేవంత్ పట్టించుకొని మల్లన్న సాగర్ నుంచి వాగులు, కాలువలకు నీళ్లు విడుదల చేసి యాసంగి పంటలు వేసుకోవడానికి సాయపడాలి.


–పాత్కుల రాములు, రైతు, వెంకట్రావుపేట, సిద్దిపేట జిల్లా



సిద్దిపేటలో రంగనాయక సాగర్ కాలువలో పెరిగిన తుంగ



రాయపోల్ మండలంలో రామారం, సయ్యద్‌నగర్ గ్రామాల వద్ద కొండపోచమ్మ నుంచి రామాయంపేట కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త, నాచు



మద్దూరు మండలం లద్నూర్ రిజర్వాయర్ కాలువలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

సిద్దిపేట, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ విషయంలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ సాగునీటి కాలువ చూసినా సిల్టు, పిచ్చిమొక్కలు, మట్టి, ఇసుకతో నిండిపోయి నీళ్లు ముందుకు వెళ్లలేని విధంగా తయారయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధాన కాలువలతోపాటు పంట కాలువలు సిల్టుతో పేరుకుపోయాయి. యాసంగి పంటలకు నీళ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. దీంతో సాగునీరు ఎలా పంట పొలాలకు చేరుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నీటి పారుదల అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఆఫీసుకే పరిమితం అవుతున్నారు తప్పా క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో చూడడం లేదు. నీళ్లు ఇస్తే ఎలా పోతాయన్న ఆలోచన కూడా చేయడం లేదు. రైతులంతా యాసంగి పనుల్లో నిమగ్నమయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగునీరు వస్తుందా..? రాదా..? అన్న అనుమానంలో రైతులు ఉన్నారు. సాగునీటి విడుదల చేయాలని ఇప్పటికే మాజీ మంత్రి, సిద్దిపేట, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. కానీ, యాసంగి సాగుకు నీటి విడుదలపై ప్రభుత్వం, నీటి పారుదల శాఖ యాక్షన్ ప్లాన్ రూపొందించలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### పూడికతో నిండిపోయిన కాలువలు

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల కింద కాల్వలు పూడికతో నిండిపోయాయి. ప్రాజెక్టుల ద్వారా పొలాలకు సాగు నీరు అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముమ్మరంగా కాలువల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్లతోపాటు అటు సింగూరు, వనదుర్గ ప్రాజెక్టులు ఉన్నాయి. శనిగరం మధ్యతరహా ప్రాజెక్టు, తపాస్‌పల్లి ప్రాజెక్టులు ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఉన్నాయి. నాలుగైదేండ్ల నుంచి గోదావరి జలాలను ఎత్తిపోసి రైతాంగానికి కేసీఆర్ ప్రభుత్వం సాగునీరు అందించింది. ప్రస్తుత యాసంగికి సాగు నీటిని విడుదల చేయాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేనట్లు ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కాలువలు ఉన్నాయి. వీటి ద్వారా సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లోని చెరువులను గోదావరి జలాలతో నింపుతున్నారు. భారీ, మధ్యతరహా, చిన్న కాలువలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించి ప్రతి చెరువుకూ నీళ్లు పోయేలా చేసింది. కాలువల నిర్వహణను చూసుకోవాల్సిన అధికారులు దానిని గాలికి వదిలేశారు. యాసంగి సాగుకు సాగునీరు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ఇంతవరకు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పిచ్చి మొక్కలను తొలిగించే పనులు చేపట్టడం లేదు. ఈ విషయంలో సాగు నీటి అధికారులు తమకు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో యాసంగి పనులను రైతులు ప్రారంభించారు. ఈసారి యాసంగిలో సిద్దిపేట జిల్లాలో అన్ని పంటలు కలిపి 3.82 లక్షలు కాగా, వరి 3.48లక్షల ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచనా వేశారు. మెదక్ జిల్లాలో అన్ని పంటలు కలిపి 2.84లక్షల ఎకరాలు కాగా, ఇందులో వరి 2.65 లక్షల ఎకరాలు సాగు చేయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో అన్ని పంటలు కలిపి 2,01,193 ఎకరాలు అంచనా వేశారు. ఇందులో వరి సాగు లక్షా పది వేల ఎకరాలు కాగా జొన్న 59 వేల ఎకరాలు, శనగ 20 వేలు, మిగితా ఇతర పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సిద్దిపేట జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లలో గోదావరి జలాలు నిండి ఉన్నాయి. ఈ నీటిని ఎప్పుడు చెరువులు నింపుతారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. పైగా ప్రధాన కాలువల్లో పూడిక నిండిపోయింది. పూడికతో నిండిపోయిన కాలువల్లో నీరు ఎలా పోతుందో నీటి పారుదల శాఖ అధికారులకే తెలియాలి. ఒకవేళ ప్రభుత్వం నీటిని విడుదల చేయాలని ఆదేశిస్తే ఈ కాలువల్లో నీరు ఎలా పోతుంది అని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గతేడాది నుంచి నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. కాగితాల వరకు ఒక రిపోర్టు, క్షేత్ర స్థాయిలో మరొకటి ఉంటుంది. కాలువలు కూలిపోయి, పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నా అధికారులకు కనిపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువలు బాగుచేయించాలని కోరుతున్నారు.



గడ్డి, నాచుతో పేరుకుపోయిన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ కుడి కాలువ



వర్గల్ మండలంలో రామాయంపేట లింక్ కాలువలో గట్టుతెగి పేరుకుపోయిన మట్టి



మద్దూరు మండలం లద్నూర్ రిజర్వాయర్ కాలువలో పేరుకుపోయిన నాచు

## దిగొచ్చిన అధికార యంత్రాంగం

### మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లింపు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు

- గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ
- ఎట్టకేలకు తొలిగిన సంగారెడ్డి జిల్లా ప్రజల కష్టాలు



న్యాల్‌కల్‌లో మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్న అధికారులు

జహీరాబాద్, డిసెంబర్ 21: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం, అందోల్ నియోజకవర్గంలోని రాయికోడ్ మండలాల్లో ప్రజల కష్టాలు ఎట్టకేలకు తొలిగిపోయాయి. నెల రోజులుగా వేతనాల కోసం కార్మికులు చేపట్టిన ఆందోళనతో అధికార యంత్రాంగం దిగివచ్చింది. కార్మికులకు వేతనాలు చెల్లించడంతో దాదాపు 75 గ్రామాలకు మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు కార్మికులు చర్యలు తీసుకున్నారు. పది నెలలకు సంబంధించి వేతనాల కోసం మిషన్ భగీరథ కార్మికులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. వేతనాల కోసం పలుమార్లు అధికారులు, కాంట్రాక్టర్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగారు. నవంబర్‌లో మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులకు ఒకనెల జీతాన్ని అందజేసి, మిగిలిన ఆరు నెలలకు సంబంధించి 20వ తేదీలోగా చెల్లిస్తామని సంబంధింత అధికారుల సమక్షంలో కాంట్రాక్టర్ ఒప్పంద పత్రాన్ని రాసి తాత్కాలిక కార్మికులకు అందజేశారు. ఇచ్చిన ఒప్పందం ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో మళ్లీ ఆందోళనకు దిగారు. వేతనాల చెల్లింపు విషయంలో రెండు, మూడుసార్లు జిల్లా, మండల అధికారులు కార్మికులతో జరిపిన చర్చలు విఫలమైయ్యాయి. వేతనాల కోసం కార్మికుల చేస్తున్న ఆందోళనతో ఆయా మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానా తంటాలు పడ్డారు. తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కార్మికల వేతనాల కోసం చేస్తున్న ఆందోళనపై పలుమార్లు పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా అధికారులు స్పందించారు. రెండు రోజుల క్రితం మునిపల్లి మండలం బుధేరాలో అధికారులు కార్మికులతో జరిపిన చర్చలు సఫలమైయ్యాయి. శనివారం మిషన్ భగీరథ జిల్లా ఎస్‌ఈ రఘువీర్, హెచ్‌ఆర్ పాష, సైట్ ఇంజినీర్ రంజిత్ న్యాల్‌కల్‌లో కార్మికులకు కొన్ని నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించారు. మిగిలిన వేతనాలు చెల్లించడంతోపాటు ఏప్రిల్ నుంచి వేతనాలు పెంచడంతోపాటు హెల్త్‌కార్డు, ఐడీకార్డు మంజూరు చేసి, ఇంక్రిమెంట్, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి వేతనాలు ఇప్పించేలా కథనాలు రాసిన నమస్తే తెలంగాణ యాజమాన్యానికి కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు. కష్టాలు తొలిగిపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### వృథాగా మిషన్ భగీరథ నీళ్లు.. పట్టించుకోని అధికారులు



కంగ్టి పట్టణంలోని భీంరా రోడ్డుపై నిలిచిన మిషన్ భగీరథ నీళ్లు

కంగ్టి, డిసెంబర్ 21: మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో ఇంటింటికీ తాగునీళ్లు అందించే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడుస్తున్నది. సంగారెడ్డి జిల్లా కంగ్టి గ్రామంలోని భీంరా రోడ్డులో మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీళ్లు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై నీళ్లు నిలబడటంతో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. లీకేజీ వల్ల కాలనీలో నీళ్లు సక్రమంగా సరఫరా కావడం లేదని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలంటున్నారు.

## ముంబయి టు హైదరాబాద్

- మహారాష్ట్ర నుంచి తీసుకువస్తున్న రూ.కోటి విలువైన డ్రగ్స్‌ను పట్టుకున్న పోలీసులు
- న్యూ ఇయర్ వేడుకలకు తెస్తున్న ఎండీఎంఏ డ్రగ్స్
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- కేసు వివరాలు వెల్లడించిన సంగారెడ్డి, నార్కోటిక్ ఎస్పీలు

పటాన్‌చెరు, డిసెంబర్ 21: మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న సంగారెడ్డి జిల్లాలో నిత్యం నిషేధిత మత్తు పదార్థాలు పట్టుబడుతున్నాయి. నిందితులు నిషేధిత మత్తు పదార్థాలను జిల్లా నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆంధ్రా–ఒడిశా(ఏవోబీ) బార్డర్ నుంచి సంగారెడ్డి జిల్లా మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలుతున్నది. తరుచూ పోలీసుల దాడుల్లో పట్టుబడుతున్న కేసుల్లో ఈ విషయం తెలుస్తున్నది. తాజాగా శనివారం న్యూ ఇయర్ వేడుకల కోసం ముంబయి నుంచి తెస్తున్న ఎండీఎంఏ డ్రగ్‌ను తనిఖీల్లో పోలీసులు పట్టుకున్నారు. శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ చైతన్య కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. ఇస్నాపూర్‌లో శుక్రవారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు తనిఖీ చేయగా, వారి వద్ద కేజీ నిషేధిత ఎండీఎంఏ డ్రగ్ పట్టుబడింది. పట్టుబడిన మహమ్మద్ సలీం అలియాస్ హమీద్ షేక్(30), ముఖేష్ దూబే(30) ముంబయి వాసులుగా గుర్తించారు. ఢిల్లీలో జేమ్మి, జిన్న అనే ఇద్దరు నైజీరియన్ల వద్ద ఈ డ్రగ్‌ను కొన్నట్లు వారు చెప్పారు. ఈ డ్రగ్‌ను హైదరాబాద్‌లో జరిగే న్యూ ఇయర్ ఈవెంట్లకు సరఫరా చేసేందుకు షేక్ ఆమేర్ అనే వ్యక్తికి అమ్మేందుకు తెచ్చామన్నారు. వీరితోపాటు ముంబయికి చెందిన రహీజ్‌ఖాన్ అనే వ్యక్తి కూడా నిషేధిత డ్రగ్స్ వ్యాపారం చేస్తాడని తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రూ.కోటి విలువైన డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. వారి వద్ద నుంచి 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు నైజీరియన్లను పట్టుకోవాల్సి ఉందని, షేక్ ఆమేర్ పరారీలో ఉన్నాడని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి సంగారెడ్డి కోర్టుకు హాజరు పరుస్తున్నామని ఎస్పీలు వెల్లడించారు. సమావేశంలో నార్కోటిక్ విభాగం అడిషనల్ ఎస్పీ సీతారాం, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ వినాయక్‌రెడ్డి, సీఐ రాజు, నార్కోటిక్ డీఎస్పీ శ్రీధర్, ఎస్‌ఐలు ఆసీఫ్ అలీ, అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### 15 రోజుల్లో రూ.4.40 కోట్ల డ్రగ్స్ పట్టివేత: నార్కోటిక్ ఎస్పీ

అసాంఘిక శక్తులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని నార్కోటిక్ విభాగం ఎస్పీ చైతన్య సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత డ్రగ్స్‌ను గుర్తిస్తే నార్కోటిక్ బ్రాంచ్ ఫోన్ నెంబర్ 87126 56777కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు రహస్యంగా ఉంచుతామన్నారు. 15 రోజుల్లో 641 కేజీల గంజాయి, 16 కిలోల గంజాయి చాకెట్లు పట్టుకున్నట్లు తెలిపారు. 1600 గ్రాముల హాష్ ఆయిల్‌ను, ఎండీఎంఏ 1కేజీ 300 గ్రాములు, ఓపీఎం కేజీ, వోజీ 97 గ్రాములు, చరస్ 115 గ్రాములు, స్ట్రా 53 కేజీలు, హెరాయిన్ 44 కేజీలు పట్టుకున్నట్లు చెప్పారు. మొత్తంగా రూ.4.40 కోట్ల విలువైన మత్తు పదార్థాలు పట్టుకున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అన్ని ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నామని, ఇన్ఫార్మర్ వ్యవస్థ సాయంతో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల్లో డీజేలపై, ఈవెంట్ మేనేజమెంట్లపై నిఘా ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.




పటాన్‌చెరులో నిందితులను చూపుతున్న ఎస్పీలు రూపేశ్, చైతన్య